## క్లుప్తంగా

### విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల ప్రదర్శన



గాలాయగూడెం పాఠశాలను సందర్శించిన ఎంఈఓ ప్రసాద్

దెందులూరు : రాష్ట్ర ప్రభుత్వం 3, 4, 5 తరగతులకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీఓఈఎఫ్ఎల్ పరీక్ష నిర్వహణ సందర్భంగా స్మార్ట్ టీవీ అందుబాటులో ఉన్న ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో ప్రసాద్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గాలాయగూడెం పాఠశాలను ఆయన సందర్శించారు. ఇంగ్లిష్ భాషలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు వర్క్‌పుస్తకాలు, తరగతుల నిర్వహణ పట్ల హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు శాంసన్‌లను ఎంఈఓ అభినందించారు.

### ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



ముప్పర్తిపాడులో మంచినీరు అందిస్తున్న సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి

గణపవరం: మండలంలోని ముప్పర్తిపాడు గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో మంచినీటి పైపులైనుల నిర్మాణం, ట్యాంకు మరమ్మతుల కారణంగా పంచాయతీ పైపుల ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి గ్రామానికి మంచినీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి, ఇంటింటికి మంచి నీరు అందిస్తున్నారు. దీనితో ప్రజలకు మంచినీటి కోసం చెరువుకు వెళ్లే అవసరం తప్పింది. పనులు పూర్తయ్యేవరకూ మంచినీటి సరఫరా కొనసాగిస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

### నేడు ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్

దెందులూరు : మండలంలోని మేధినరావుపాలెం గ్రామంలో గురువారం ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయిల్‌ఫామ్ శాఖాధికారులు తెలిపారు. తొలుత ఆయిల్‌పామ్ రైతులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు.

### నేటి నుంచి ప్రేమ్ మసంద్‌జీ పర్యటన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ప్రతినిధి, అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ ప్రేమ్ మసంద్‌జీ ఈ నెల 3 నుంచి నగరంలో పర్యటిస్తారని బ్రహ్మకుమారీస్ ఏలూరు శాఖ నిర్వాహకురాలు బీకే లావణ్య తెలిపారు. స్థానిక బ్రహ్మకుమారీ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 4న బ్రహ్మకుమారీస్ కార్యాలయంలో కుటుంబంపై మహిళ ఆరోగ్య ప్రభావం, క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల శారీరక, మానసిక, భావోద్వేగ, ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని చెప్పారు. మధ్యాహ్నం సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు. 5న ఆశ్రం కళాశాలలో, 6న సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు, 7న ఉదయం రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో, మధ్యాహ్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో, 8న సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాలలో ఆయన ప్రసంగం ఉంటుందని చెప్పారు. అధిక సంఖ్యలో పాల్గొని ప్రయోజనం పొందాలని కోరారు. సమావేశంలో బ్రహ్మకుమారీస్ ఏలూరు నగర శాఖ ప్రతినిధులు ఎంబీఎస్ శర్మ, బీకే లక్ష్మీ నారాయణ, బీకే నరసింహరావు పాల్గొన్నారు.

### చెట్టు పట్టాలు మంజూరు చేయాలి

ఏలూరు రూరల్: దళిత రైతులకు చెట్టు పట్టాలు మంజూరు చేయాలని దళితసేన అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. బుధవారం ఏలూరులో జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రదామాను దళితసేన ఏలూరు జిల్లా మహిళ అధ్యక్షురాలు బేతాళ జయసుధ, చీలి మోహనరావు, లక్కపాము చంటి, ఫిరంగుల ఈదియా, రమణ డీఎఫ్‌ఓను కలిసి వినతిపత్రం అందించారు. లింగపాలెం మండలం తోచలకరాయుడుపాలెంలో 24 మంది దళితులకు సర్వే నెంబర్ 1 భూముల్లో జీడిమామిడి సాగుకు అనుకూలంగా చెట్టు పట్టాలు అందించాలని కోరారు.

### 7, 8 తేదీల్లో దీక్షలు

ఏలూరు (టూటౌన్): వీఆర్‌ఏల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7, 8 తేదీల్లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద సామూహిక రిలే దీక్షలు చేపట్టనున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మాజీ తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏలూరు, నూజివీడు డివిజన్‌ల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆర్ లింగరాజు, వీఆర్‌ఏల సంఘం జిల్లా కోశాధికారి గంగాధరరావు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి
- కుడి కాలువ నుంచి సాగు నీటి విడుదల



కొప్పులవారిగూడెంలో పూజలు నిర్వహించి కుడికాలువ నీటిని గుండేరులోకి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, ఇతర నాయకులు

పెదవేగి : రైతుల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం గ్రామంలోని పోలవరం ప్రధాన కుడి కాలువ నుంచి బుధవారం రైతులకు సాగు నీటిని విడుదల చేశారు. పోలవరం కాలువ లాకుల నుంచి గుండేరు వాగుద్వారా సీతంపేట సప్లై ఛానల్‌కు రైతుల సమక్షంలో పోలవరం కాలువ నీటిని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చేతుల మీదగా ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు సాగునీటి, విద్యుత్ కష్టాలను దూరం చేయడమే కాకుండా పెట్టుబడి మొదలు పంటల కొనుగోలు దాకా అన్నివిషయాల్లో అండగా నిలిచారని చెప్పారు. ఇప్పుడు ఈ కాలువద్వారా నీటిని విడుదల చేయడంతో 12 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని, పంటలు బాగా పండి, అన్నదాత ఇంట్లో సిరులు పండనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సీతం పేట సప్లై ఛానల్ ద్వారా విడుదల చేసిన పోలవరం నీటి ద్వారా నేరుగా 4 వేల ఎకరాలు.చెరువుల ద్వారా మరో 8 వేల ఎకరాల ఖరీఫ్ పంటకు సాగు నీరు అందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలో ప్రజలకు, రైతులకు పోలవరం ద్వారా సాగు, తాగునీరు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేది, ప్రారంభించేది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తెలిపారు. ఈ సందర్భంగా రైతులు సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దెందులూరు సొసైటీ చైర్‌పర్సన్ కొలుసు గణపతిరావు, జోగన్నపాలెం సొసైటీ చైర్‌పర్సన్ పాకలపాటి వాసు, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు తోత్తడి వేదకుమారి, నాయకులు మాదాల సుబ్బారావు, చలపాటి సంజీవరావు, పోకల రాంబాబు, పెదవేగి మండల సచివాలయాల కన్వీనర్ కేసిన సతీష్, తేరా ఆనంద్, ఏఎంసీ మాజి చైర్మన్ మేకా లక్ష్మణరావు పాల్గొన్నారు.

### నేడు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

దెందులూరు : దెందులూరు మండలపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత అధ్యక్షతన గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల మండలాధికారుల హాజరుకావాలని కోరారు.

### నేడు కొబ్బరి రైతుల జిల్లా సమావేశం

పెదవేగి : ఏలూరు, పవర్ పేట, డాక్టర్ చెన్నకేశవుల రంగారావు వీధిలోని రైతు సంఘం జిల్లా కార్యాలయం హాల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు కొబ్బరి రైతుల జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కొబ్బరి రైతుల సంఘం నాయకులు గుడిబండి రమేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కొబ్బరి రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కొబ్బరి రైతులు పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# అర్హులకు సంక్షేమ లబ్ధి అందించడమే లక్ష్యం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని పాతముప్పర్రు గ్రామంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి బుధవారం రాత్రి ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువచ్చారు. డ్రెయినేజీలు నిర్మించాలని, రహదారులు అభివృద్ధి చేయాలని, ఇళ్ల, ఇంటిలోను అందించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖా అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. పేదల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారన్నారు. ప్రజలకు సక్రమంగా పథకాలు చేరవేస్తున్న వలంటీర్లపై కొందరు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజలు నిజాలు తెలుసుకుని వారిని ఛీకొట్టడం ఖాయమన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అప్పన కనక దుర్గాప్రసాద్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి సంతోష్, మాజీ సర్పంచ్ మెడబలిమి సంతోష్‌కుమార్, కొండే లాజరు, బత్తుల ఏసురాజు, మెడబలిమి జాన్సన్, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

### పింఛన్ అందజేత



దెందులూరు : గాలాయగూడెంలో పింఛన్ అందచేస్తున్న వలంటీర్ స్వరూపారాణి



పెదపాడు : ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రాంబాబు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పింఛన్ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా సాగుతోంది. మంగళవారం అందుబాటులో లేనివారికి బుధవారం పింఛన్‌లను అందజేశారు. - దెందులూరు, పెదపాడు

# ఉత్సాహంగా గడపగడపకు మన ప్రభుత్వం



కైకరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: పేదలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం కైకరంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష సభల ద్వారా నియోజకవర్గంలో 60,043 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించామన్నారు. ప్రజలు ఇప్పటికే సీఎం జగన్ పక్షాన ఉన్నారన్న సంకేతంతో ప్రతిపక్షాలు వణుకుతున్నాయని అందువల్లే పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్మెన్ మరడ రమావతి, నాయకులు పుప్పాల గోపి, మట్టా మురళీ, పాపారావు బాబ్జి, పైడి ముక్కల రామకృష్ణ, కొరిపల్లి శ్రీను, మిద్దే వెంకటేశ్వరరావు, నక్కా శ్రీను, రాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్నకు ప్రత్యేక పూజలు

భీమడోలు: మండలంలోని గుండుగొలనులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వారి శ్రవణానక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పాలాభిషేకాలు చేశారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, మోహనకృష్ణ ఆచార్యులు, సాయి ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డి.శంకరరావు, ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వగ్గాల మీనా కుమారి, అచ్యుతరామారావు పాల్గొన్నారు.

### నేడు కైకరంలో గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: మండలంలోని కైకరంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

# విద్యా ప్రమాణాలపై దృష్టి పెట్టాలి



పోలసానిపల్లి నెం.1 పాఠశాలలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంఈవో ఈ.శ్రీనివాసరావు

భీమడోలు: నాడు నేడు పథకం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారీ బడులు రూపుదిద్దుకుంటున్నాయని భీమడోలు ఎంఈవో 1 ఈద్పుగంటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పోలసానిపల్లి నెం.1, నెం.2, నెం.3 ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన ఆకస్మిక సందర్శించారు. పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షల నిర్వహణ, విద్యా సామర్థ్యాలు, నాడు నేడు పనుల పురోగతి, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పోలసానిపల్లి నెం-1లో చేపట్టిన అదనపు తరగతి నిర్మాణ పనులు, మరుగుదొడ్డి నిర్మాణ పనులు ఆయన పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కె.తులసిని ఆదేశించారు. పోలసానిపల్లి నెంబర్-3లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.బాలభాస్కర్, కె.తులసి, టీచర్లు జె.వసంత, వసుంధర, మౌళిక తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో మారణహోమం దారుణం

భీమడోలు: మణిపూర్‌లో జరిగిన మారణ హోమంపై మానవతావాదులంతా ఉద్యమించాలని మండల ఐక్య క్రైస్తవ వేదిక అధ్యక్షుడు పాస్టర్ డీవీ రత్నం అన్నారు. గుండుగొలనులో బుధవారం మండల ప్రజా సంఘాలు, క్రైస్తవ సంఘాలు, పాస్టర్ల అసోసియేషన్, దళిత సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరిగిన దారుణకాండను నిరసిస్తూ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పాస్టర్ వి.శ్యాంకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీవీ రత్నం, దళిత సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ టి.సుమన్‌బాబులు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మారణ హోమాన్ని ఖండిస్తూ ఈనెల 8వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు భీమడోలు రైల్వే గేటు నుంచి జంక్షన్ వరకు శాంతి ర్యాలీ, మానవహారంగా ఏర్పడి అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తామన్నారు. మండలంలోని అయా సంఘాల ప్రతినిధులు, మండల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంజేటి విజయ్‌అచ్యుతం, వి.యోషయ్య, విశ్వాసరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రెయిన్ అభివృద్ధి పనుల పరిశీలన



డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదపాడు : మండలంలోని ముప్పర్రు కాశీ కాలువ పూడికతీత పనులను దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం పరిశీలించారు. కొత్తూరు నుంచి ముప్పర్రు వరకు నీటి సరఫరా సరిగా లేకపోవడంతో సాగు, తాగునీరుకు ఇబ్బందులు పడుతున్నామని 30 ఏళ్లుగా ఎవరూ మరమ్మతులు చేపట్టలేదని అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకురావడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానిక నాయకుడు అక్కినేని రాజశేఖర్‌ను ఆదేశించారు. దీంతో గత 10 రోజులుగా ఈ డ్రెయినేజీ పనులు హుటాహుటీన చేపట్టారు. 4 కిలోమీటర్ల మేర ఉన్న ఈ డ్రెయినేజీ అభివృద్ధికి అబ్బయ్య చౌదరి తన సొంత నిధులు వెచ్చించి మరమ్మతులు చేపట్టడంపై స్థానిక నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు అప్పన కనక దుర్గాప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, కోట గోవర్ధన్, ఇల్లూరి రాజు, ఎంపీటీసీ అనిల్, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నర్సింహరావు(నాని), కడిమి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



జీవామృతం తయారీని రైతులకు వివరిస్తున్న అధికారులు

భీమడోలు: వరిలో ప్రకృతి వ్యవసాయాన్ని పాటించడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఆహారోత్పత్తులను పొందవచ్చునని వ్యవసాయ శాఖ ఏలూరు, భీమడోలు ఏడీఏలు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ పి.ఉషారాజకుమారిలు అన్నారు. భీమడోలులో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమంలో బుధవారం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఈ పొలంబడి కార్యక్రమం పాల్గొని రైతులు సూచనలు, యాజమాన్య పద్ధతులను తెలుసుకున్నారు. జీవామృతం తయారీ చేసే విధానాన్ని రైతులకు చూపించారు. కలుపు యాజమాన్యం, జీవామృతం తయారీ, వరి సాగులో మెలకువలను రైతులకు వివరించారు. జీవామృతంలో వినియోగించే వేపపిండి, నూనె వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. అనతరం రైతులతో తమ పొలం గట్లపై ఆకర్షణీయమైన బంతి నారును నాటించారు. కార్యక్రమంలో ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



తల్లి పాల విశిష్టతను వివరిస్తున్న ఐసీడీఎస్ పీఓ కె.విజయలక్ష్మి



చిలకంపాడులో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న డాక్టర్లు

భీమడోలు: తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ భీమడోలు పీఓ కె.విజయలక్ష్మి అన్నారు. గుండుగొలనులోని ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో బుధవారం తల్లి పాల విశిష్టతపై తల్లులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎం.కవిత అధ్యక్షతన నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలను వైఎస్ ఎంపీపీ డోకల వాసంతి, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, వైస్ ఎంపీపీ డోకల వాసంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాజమణి, ఎం.విజయలక్ష్మి, జె.పద్మకుమారి పాల్గొన్నారు.

**వ్యాధులపై అప్రమత్తత అవసరం**

డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తం కావాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జి.గోవిందరావు అన్నారు. పూళ్లలో వ్యాధి టీకా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు.ప్రతి ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని, తద్వారా దోమల వ్యాప్తి చెందవన్నారు. అనంతరం తల్లి పాల విశిష్టత, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మోహనసాయి, ఏఎన్ఎం ప్రమీలా, అరుణదేవి, ఎంఎల్‌హెచ్‌పీ నందిని, హెల్త్ అసిస్టెంట్ రమేష్, సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

**గణపవరంలో..**

గణపవరం: తల్లిపాలలో ఎన్నో పోషకాలు ఉన్నాయని, తల్లి ముర్రిపాలు బిడ్డకు జీవితాంతం రక్షణ కవచంలా ఉంటుందని పిప్పర పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. కె.ప్రియాంక అన్నారు. బుధవారం గణపవరం మండలం చిలకంపాడు, కాశిపాడు గ్రామాలలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని, ప్రతి తల్లి ప్రసవించిన వెంటనే గంటలోపు తమ బిడ్డకు ముర్రిపాలు ఇవ్వాలని సూచించారు. పాల వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి జలుబు, దగ్గు, జ్వరం, న్యూమోనియా, నివారణకు జీవితాంతం ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు పి.వెంకట నారాయణ, లెప్రసీ నోడల్ పర్సన్ నామాలరాజు పాల్గొన్నారు.